విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana సంపుటి:1, సంచిక:95 volume: 1, Issue:95 సోమవారం 03 నవంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00


## అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో

# పారదర్శకతకు ప్రాధాన్యం

**–సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు...**



**హైదరాబాద్ :**రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తన ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామం, పట్టణానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా సమర్థవంతంగా పని చేయాలని సంబంధిత శాఖల అధికారులను సీఎం ఆదేశించారు. ఫ్లాగ్‌షిప్ అభివృద్ధి, సంక్షేమ పథకాల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం కొత్తగా నియమించిన సలహాదారుడు బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డికి అప్పగించింది. ఈ నియామకంతో పథకాల అమలు మరింత వేగవంతం అవుతుందని, జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించి లోటుపాట్లు గుర్తించి వెంటనే పరిష్కరించాలనే బాధ్యత ఆయనపై ఉందని అధికారులు తెలిపారు. ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ పథకాల ద్వారా మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, విద్యార్థుల అభివృద్ధి, వృద్ధులు మరియు బలహీన వర్గాలకు రక్షణ కల్పించడం లక్ష్యమని సీఎం తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా, ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం వారికి ఉపయోగపడేలా ఉండాలని సీఎం దృష్టి సారించారు. పథకాల అమలులో ఎక్కడైనా అవినీతి, నిర్లక్ష్యం చోటుచేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమగ్ర పాలన ద్వారా తెలంగాణను ముందుకు తీసుకెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## భారత అంతరిక్ష రంగం మరో మైలురాయిని చేరింది

**–విజయవంతంగా అంతరిక్షంలోకి సీఎంఎస్–03...**



**శ్రీహరికోట :**భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరోసారి చరిత్ర సృష్టించింది. దేశంలోనే అత్యంత భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎంఎస్ 03ను స్వదేశీ రాకెట్ ఎల్‌వీఎం 3 ఎం5 సాయంతో విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శనివారం తెల్లవారుజామున ఆకాశాన్ని చీల్చుకుంటూ ఎగసిన రాకెట్ దృశ్యం దేశవ్యాప్తంగా ఆనంద తరంగాలను రేపింది. ఈ సాంకేతిక ప్రతిభను ప్రపంచానికి చాటింది. ఈ సందర్భంగా ఇస్రో సోషల్ మీడియా వేదికల ద్వారా "ఇది గర్వించదగిన క్షణం! #LVM3M5 రాకెట్ #CMS03 ఉపగ్రహాన్ని విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. భారత అంతరిక్ష ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది." అని పేర్కొంది. సీఎంఎస్ 03 ఉపగ్రహం ద్వారా దేశంలోని కమ్యూనికేషన్, ప్రసార, నావిగేషన్ వ్యవస్థలు మరింత బలపడనున్నాయి. భారత భూభాగంతో పాటు పరిసర ప్రాంతాలకు కూడా అత్యాధునిక సేవలను అందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేస్తూ "భారత అంతరిక్ష రంగం నిరంతరం నూతన శిఖరాలను అధిరోహిస్తోంది. మన శాస్త్రవేత్తల ప్రతిభ, కృషి, నిబద్ధత దేశ అభివృద్ధికి ప్రేరణగా నిలుస్తోంది" అని పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన ఈ ఘన విజయం భారత్ అంతరిక్ష రంగాన్ని ప్రపంచస్థాయిలో మరింత ఉన్నతస్థితికి చేర్చిందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

## రైతుల పక్షాన మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాలకు వైయస్ జగన్ పర్యటన



**–వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకటన...**

**మచిలీపట్నం:**మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 4న మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించనున్నట్లు పార్టీ నేతలు పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ప్రకటించారు. జగన్ పర్యటన కృష్ణా జిల్లా పరిధిలోని పెనమలూరు, పామర్రు, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో కొనసాగుతుంది. పెడన, మచిలీపట్నాల్లో రైతులను ప్రత్యక్షంగా కలసి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. తుపాను ధాటికి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పడమే ఈ పర్యటన ఉద్దేశమని వైయస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పంటలు భారీగా దెబ్బతిన్నాయి. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటివరకు రైతులను ఆదుకునే స్పష్టమైన చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. ఉచిత పంట బీమా రద్దు చేయడం, ఆర్బీకేలను నిర్వీర్యం చేయడం, ఈ–క్రాప్ విధానాన్ని నిలిపివేయడం వంటి చర్యలతో ప్రభుత్వం రైతులకు పెద్ద దెబ్బ కొట్టిందని విమర్శించారు. రైతులు వరుస తుపాన్లతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదని, దాదాపు రూ. 600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతుల తరఫున వారి గొంతు వినిపించేందుకు, ప్రభుత్వాన్ని స్పందింపజేసేందుకు వైయస్ జగన్ పర్యటన చేపడుతున్నారని తెలిపారు.

## భారత మహిళల జట్టుకు ప్రధాని మోదీ అభినందనలు...



భారత మహిళల క్రికెట్ జట్టు **2025 ICC Womes World Cup** విజేతగా నిలవడంతో ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ విజయాన్ని ఆయన "చారిత్రాత్మక ఘట్టం"గా అభివర్ణించారు, ఇది భవిష్యత్ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.

## ఢిల్లీలో పేదల ఇళ్లో బుల్డోజర్ పోతే ఆందోళన చూపించిన రాహుల్...

**–తెలంగాణలో ఎందుకు చప్పగించావు?"**

**–కేటీఆర్ తిప్పిళ్ళు...**



**హైదరాబాద్, నవంబర్ 2 :**రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నట్టుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై తీవ్ర వ్యంగ్యాన్ని తెలియజేశారు. డెల్లీ, యూపీ వంటి ప్రాంతాల్లో పేదల ఇళ్లను బుల్డోజర్లతో ధ్వంసం చేస్తున్న సందర్భాలకు వ్యతిరేకంగా రాహుల్ అరుస్తున్నారని, అదే మన తెలంగాణలో జరగటం గమనించకపోవడం ఆందోళనాకరమని కేటీఆర్ వెల్లడించారు. "డెల్లీలో, యూపీలో పేదల ఇళ్లపై బుల్డోజర్ పోతే నేను అడ్డం పడుకుంటా అని రాహుల్ గారు చెప్పడానికి అది అభినందనీయం. కానీ తెలంగాణలో నీ కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి దౌర్జన్యంగా పేదల ఇళ్లను కూల్చిపోస్తున్నప్పుడు అదే మాటకు మనసు ఎందుకు ముడుచుకున్నావ్? ఏమ్మాటి ఎక్కడికి చేరిపోయావ్?" అంటూ అదనపు ప్రశ్నలు వేయించారు. కేటీఆర్ విమర్శలు ఏకంగా ప్రభుత్వ విధానాలపై దృష్టి సారించాయి. ఆయన వ్యాఖ్యలలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని పేద ప్రజలపై చూపుతున్న నిష్పక్షపాత వ్యవహారాన్ని ఖండిస్తూ, రాజకీయ నాయకుల నిర్దిష్టమైన స్పందనలపై వినోదపూర్వక మార్గంలో గట్టి ప్రశ్నలు వేయడం స్పష్టమైంది. పేదల ఇళ్లపై మర్యాదలేనిదేమైనా జరిగితే ప్రతిపక్షం మాత్రమే కాక ప్రభుత్వ మద్దతుతో కూడిన చర్యలు ఎందుకు కనిపిస్తున్నాయో సమాజానికి తెలుస్తుండాలి అన్న విషయం ఆయన ఉద్దేశ్యంగా ఊహింపజేశారు. పర్యవేక్షణలో ఉన్న అనేక సంఘటనల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు రాజకీయ చర్చకు వేసేలా ఉన్నాయి. ప్రభుత్వం ఎక్కడైనా ఉన్న అనివార్య కారణాల వల్లా బుల్డోజర్/ధ్వంస చర్యలు చేపడితే, అవి ప్రజా న్యాయం, పారదర్శకత కలిగి ఉంటాయని కేటీఆర్ డిమాండ్ చేశారు. అదే సమయంలో, రాజకీయ నాయకులు సమస్యలను రాజకీయ రంగస్థాయిలో కాకుండా నేరుగా ప్రజా సంక్షేమం కోసమే పరిష్కరించాలని కూడా ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలకి ప్రత్యక్ష ప్రతిస్పందనలు త్వరలోనే వస్తాయనే అనూహ్యామే. తద్వారా రాజ్యాంగ పరిరక్షణ, పేదల హక్కుల పరిరక్షణ వంటి అంశాలు స్థాయిని పెంచుకుని ప్రస్తుతం సాగుతున్న రాజకీయ ద్వంద్వానికి కొత్త తిరుగుల్ని తెస్తాయేమో చూడాలి.

## భువనేశ్వరి అవార్డులు అందుకోబోతుండటం గర్వకారణం చంద్రబాబు



**లండన్ :**వ్యక్తిగత పర్యటన నిమిత్తం లండన్ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులకు అక్కడి తెలుగు కుటుంబాలు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, విదేశాల్లో ఉన్నా మన తెలుగు ప్రజలు చూపించే ఆత్మీయత అపూర్వమని, వారి ప్రేమ, ఆతిథ్యం తాను మరిచిపోలేనిదని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (IOD) సంస్థ నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో భువనేశ్వరి రెండు విశిష్ట పురస్కారాలు అందుకోబోతున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా ప్రజాసేవ, సామాజిక ప్రభావం విభాగంలో 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025' అవార్డు, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో 'గోల్డెన్ పీకాక్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్' అవార్డులు ఆమెకు దక్కనున్నాయి. భారతదేశం నుంచి వ్యాపార నైతికత, పారదర్శకత, సామాజిక బాధ్యతల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఈ అవార్డులు ప్రదానం చేయడం IOD ప్రత్యేకతగా ఉంది. తాను ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నానని, భువనేశ్వరి సాధించిన ప్రతి విజయానికి వెనుక తెలుగు ప్రజల ఆశీర్వాదం ఉందని ఆయన పేర్కొన్నారు. లండన్ పర్యటనలో దంపతులు పలు తెలుగు సంఘాలతో సమావేశమై సాంఘిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి అచ్చెన్నాయుడు



**పలాస, నవంబర్ 2 :**కాశీబుగ్గలో నిన్న జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడ్డ భక్తులను మంత్రి అచ్చెన్నాయుడు పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు. అచ్చెన్నాయుడు గాయపడిన భక్తుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం చెక్కులను అందజేశారు. గాయపడిన వారికి అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రమాదం చాలా బాధాకరమని పేర్కొంటూ, బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇలాంటి ఘటనలు మరల జరగకుండా చర్యలు తీసుకుంటామని అచ్చెన్నాయుడు తెలిపారు.

## క్రెడిట్ కార్డు లిమిట్ పెంపు

### మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**– తెలంగాణ పోలీసుల హెచ్చరిక...**

హైదరాబాద్ : క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని నమ్మబలికి ప్రజలను మోసం చేసే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు ప్రజలకు అప్రమత్తత సూచనలు జారీ చేశారు. ఇటీవల అనేకమంది తమ కార్డు వివరాలు, ఓటీపీలు, పిన్ నంబర్లు తెలియజేసి మోసపోయినట్లు ఫిర్యాదులు అందుతున్నాయని పోలీసులు తెలిపారు. పోలీసులు జారీ చేసిన ప్రకటనలో, క్రెడిట్ కార్డు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, ముఖ్యంగా కస్టమర్ కేర్ ప్రతినిధులుగా చెప్పుకునే వారిని నమ్మవద్దని హెచ్చరించారు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ లింకులు పంపరని, లిమిట్ పెంపు కోసం ఓటీపీ అడిగితే అది ఖచ్చితంగా మోసమని ప్రజలకు సూచించారు. అదేవిధంగా, ఏవైనా అనుమానాస్పద సందేశాలు, ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు వెంటనే వాటిని పట్టించుకోకుండా సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం అందించాలని సూచించారు. తెలంగాణ పోలీసులు ప్రజలను హెచ్చరిస్తూ..జాగ్రత్తగా ఉండండి, మోసగాళ్లకు దూరంగా ఉండండిహౌఅనిహౌతెలిపారు

# సింగరేణి మారుపేర్ల బాధితుల ఆవేదను ఆధార
# ఉద్యోగాల కోసం 15 ఏళ్లుగా ఎదురు చూపులు

**-కొత్తగూడెం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన బాధితులు...**

**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 2 (మనవార్త):** సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉండటంతో ఆధార ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసిన బాధితులు ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బాధితులు కొత్తగూడెం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ముప్పై సంవత్సరాల పాటు సింగరేణిలో సేవలందించి, అనారోగ్య కారణాలతో కార్పొరేట్ మెడికల్ బోర్డు ద్వారా ఇన్వాలిడేట్ అయిన తర్వాత ఆధార ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసిన తమపై విజిలెన్స్ అధికారులు "మారుపేర్లతో ఉద్యోగం చేశారు" అనే కారణంతో కేసులు పెట్టారని బాధితులు వివరించారు. ఈ కారణంగా గత 15 సంవత్సరాలుగా ఉద్యోగావకాశం దక్కక ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొంటున్నామని, కుటుంబ పోషణ భారంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. "మాకు సకాలంలో ఉపాధి లభించక జీవనోపాధి దారుణ స్థితిలో పడిపోయింది" అని వారు పేర్కొన్నారు. గతంలో లేబర్ కమిషన్ సమక్షంలో సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి మారుపేర్ల సమస్యను పరిష్కరిస్తామని, విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఒప్పందం చేసుకున్నప్పటికీ ఇప్పటి వరకు అమలు కాలేదని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాయం సూరయ్య, వాసం రాములు, భూక్య నాగేష్, భూక్య పాప, కేలోత్ జేత్యా, కేలోత్ రమేష్, పెంటయ్య, కేలోత్ బాలు, లాలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# నేలవాలిన పైరునూ పైకిలేపి తాళ్లతో కడుతూ



**మల్యాల, నవంబర్ 02(మన వార్త ప్రతినిధి)** అకాల వర్షాలకు నేలవాలిన తన వరి పంటను బతికించుకోవడానికి ఓ రైతు పడరాని పాట్లు పడుతున్నాడు. మల్యాల మండల కేంద్రానికి చెందిన రైతు అల్లూరి అనంతరెడ్డి తన వ్యవసాయ పొలంలోని వరి పంట ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నేలపై ఒరిగింది. కాగా, పంట కోతకు రాకపోవడంతో దాన్ని రక్షించుకోవడానికి నేలపై వాలిన వరిపైరు నుంచి ఒక్కో కర్రను పైకి లేపుతూ.. మూడు కర్రల చొప్పున కలిపి తాళ్లతో కడుతున్న దృశ్యం రైతన్న పడుతున్న కష్టాలను తెలియజేస్తోంది.

# త్వరలో ప్రారంభం కానున్న ఆధునిక జిమ్ సెంటర్

**-ఎల్కతుర్తి గ్రామ యువతకు శుభవార్త ...**

**ఎల్కతుర్తి నవంబర్ 02 మన వార్త ప్రతినిధి** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి గ్రామ యువతకు మోరల్ బూస్ట్ ఇవ్వడానికి కొత్త శకం ప్రారంభమవుతోంది ఎల్కతుర్తి గ్రామపంచాయతీ ఆవరణంలో ఆధునిక సదుపాయాలతో కూడిన జిమ్ సెంటర్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామ ప్రజల ఆవశ్యకతను గుర్తించి హుస్నాబాద్ శాసనసభ్యులు రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ 5 లక్షలు రూపాయలు మంజూరు చేయగా, ఆ నిధులతో జిమ్ పరికరాలను ఏర్పాటు చేయడంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వీరమల్లు రంజిత్ రెడ్డి కీలకపాత్ర పోషించారు. యువత శారీరక దృఢత్వం ఆరోగ్య పరిరక్షణ క్రీడాస్ఫూర్తి పెంపు దృష్ట్యా ఈ జిమ్ సెంటర్ గ్రామానికి మేలుచేసే కార్యక్రమంగా నిలవనుంది అని త్వరలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతులతో జిమ్ సెంటర్ ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఆధునిక పరికరాలతో రూపుదిద్దుకుంటున్న ఈ జిమ్ సెంటర్ యువతకు ప్రేరణగా, ఆరోగ్యాభివృద్ధికి దోహదం చేస్తుందనే ఆశాభావం వ్యక్తం అవుతుందని కాంగ్రెస్ పార్టీ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్లు,రంజిత్ రెడ్డి తెలిపారు.




# ఘనంగా డాక్టర్ వాసిరెడ్డి రామనాథం జన్మదిన వేడుకలు

**మధిర నవంబర్2( మన వార్త)** తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, కనకదుర్గ దేవస్థానం మాజీ ధర్మకర్త, మధిర పట్టణ సీనియర్ వైద్యులు, ప్రజా వైద్యశాల అధినేత, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మధిర మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, ప్రజలకు స్నేహితుడు, ప్రజలందరిలో ఒకరు. ప్రజలందరికి సుపరిచితుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం గారికి 85 వ జన్మదిన వేడుకలు. విద్యార్థి దశ నుండే అలవడిన సామాజిక సేవా కార్యక్రమాల ప్రభావం రాజకీయాలవైపు నడిపించిందని, ఆ నేపథ్యంలోనే అన్న నందమూరి తారక రామారావు గారి ఆశయాలు, ఆలోచనలతో ప్రేరణ పొంది ఆయన స్థాపించిన తెలుగు దేశం పార్టీ లో చేరానని, దరిమిలా మూడు పర్యాయాలు మధిర సర్పంచ్ గా, ఒకసారి మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ గా ప్రజాసేవ చేసే భాగ్యం కలిగిందని ఖమ్మం పార్లమెటరీ టిడిపి కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. మధిర పట్టణ టిడిపి అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు అధ్యక్షతన, పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు సమక్షంలో డాక్టర్ రామనాథం 85వ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా డాక్టర్ రామనాథం కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేసారు. కార్యక్రమంలో నాయకులు మేడా వెంకటేశ్వరరావు, అనుమోలు సతీష్, ఈదర వెంకటేశ్వరరావు, యడవల్లి నాగభూషణం, నాగులంచ శ్రీనివాసరావు, పాశం రామనాథం, మన్నేపల్లి రత్నకుమారి, కేశవపట్నం రామయ్య, దేవభక్తుని వెంకట్, చావా రాము, తిరుపతి కృష్ణమూర్తి, వీరవల్లి కోటేశ్వరరావు, పాశం వెంకటేశ్వర్లు, బనమ్ సాహెబ్, వట్టికొండ రామ్మోహన్, వాసిరెడ్డి ఈశ్వర్, జమ్ముల కోటేశ్వరరావు, వాసిరెడ్డి ప్రకాశరావు, వేల్పుల కొండ, నిర్మల, వినుకొండ కృష్ణమూర్తి, మైనీడి జగన్మోహన్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, పోతినేని కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులందరికీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు భోజనాలు ఏర్పాటుచేశారు.




# సిపిఎస్ స్కూల్ పూర్వ విద్యార్థులు పేద విద్యార్థినికి ల్యాప్ టాప్ అందజేత

**-పల్లఖండం చంద్రశేఖర్ రావు కుటుంబ సభ్యులు సిపిఎస్ స్కూల్ స్నేహితుల ఆర్థిక సహాయం...**

**మధిర,నవంబర్2( మనవార్త)** మధిర పట్టణంలో టైలరింగ్ 45 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న రామిశెట్టి శ్యాంసుందర్ కూతురు రామిశెట్టి సాయి పల్లవికా ఇంజనీరింగ్ రెండు సంవత్సరం సి ఎస్ సి ఖమ్మం ప్రియదర్శిని కాలేజీలో చదువుతున్నది. అయితే ఆమె ఉన్నత చదువు కోసం ల్యాప్ టాప్ అవసరం ఉండడంతో డబ్బులు లేకపోవడం దాతల కోసం ఎదురు చూస్తుండగా పల్లఖండం చంద్రశేఖర రావు కుటుంబ సభ్యులు, అదేవిధంగా మధిర సిపిఎస్ స్కూల్ 1984 సంవత్సర 10వ తరగతి విద్యార్థులు,మధిర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ 1992 సంవత్సర స్నేహితులు ఆర్థిక సహాయంతో ఆదివారం మధిర పట్టణంలోని పల్లఖండం చంద్రశేఖర రావు కుటుంబ సభ్యులు స్నేహితులు సమక్షంలో లాప్టాప్ ను విద్యార్థినికి అందజేశారు. పల్లఖండం చంద్రశేఖర్ రావు,అద్దంకి విప్లవకుమార్ లు మాట్లాడుతూ..... ఆర్థిక సాయం చేయడం ముఖ్య ఆర్థికవిషయమే అయినప్పటికీ ఆర్థిక సాయం అవసరమైన వ్యక్తికి సహాయం చేయడం ఇంకా గొప్ప విషయమని తెలిపారు. సహాయం పొందిన విద్యార్థిని గొప్ప ఉన్నత సహాయంశిఖరాలకు చేరుకుని పలువురికి ఆర్థిక సాయం చేయాలని విద్యార్థిని కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్లఖండం చంద్రశేఖర్ రావు, పుల్లఖండం సత్యనారాయణమూర్తి, కొల్లా శ్రీనివాసరావు,చిన్నం శ్రీనివాస్, నాగేశ్వరరావు, లాయర్ గోపాల్, కొనటం వెంకటేశ్వరరావు, చారి, నరసింహమూర్తి, పాడిబండ్ల శ్రీనివాసరావు,అద్దంకి విప్లవ కుమార్ స్నేహితులు గొడ్డు శీను, ప్రేమ్ చాంద్ పల్లపోతు రవి తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...



**చేగుంట నవంబర్ 2( మన వార్త ప్రతినిధి )**చేగుంట మండల కేంద్రంలోని శ్రీ సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ లో 2000, 2001 కి సంబంధించిన చేగుంట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పదవ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాని ఘనంగా నిర్వహించారు, 25 సంవత్సరాల తర్వాత కలిసిన విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు ఒకరికొకరు ఆ లింగనం చేసుకుంటూ వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు, అనంతరం విద్యాబోధన నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత అందరూ ఒకే చోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని ముందు ముందు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటామని దీంతోపాటు మండలంలో సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు వారు తెలిపారు, 2000-2001 బ్యాచ్ కి సంబంధించిన విద్యార్థులమంతా కూడా ఎవరికి ఏ ఇబ్బందులు వచ్చినా ఒకరికొకరం తెలుపుకొని ఇబ్బందులు తొలగించుకుంటూ ఏవైనా సమస్యలను వస్తే కూడా వాటిని పరిష్కరించుకునేందుకు ప్రతి ఒక్కరం కలిసిమెలిసి ఉంటూ ముందుకు సాగాలని వారు కోరారు, చిన్ననాటి జ్ఞాపకాల గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు స్వార్థం లేనిది ఆపదలో గుర్తుకు వచ్చేది ఒక స్నేహమేనని స్నేహానికి ఉన్న విలువ మరి ఏ దానికి లేదని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 2 (మన వార్తా ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సింగరేణి సహకారంతో కొత్తగూడెం క్లబ్ లో ఈ నెల 11 నిర్వహించే మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజుతో కలిసి దీనికి సంబందించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, పీజీ, ఫార్మసీ వంటి అర్హతలతో 18 నుండి 40 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరు కావొచ్చన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, వాటి జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు.




# హెల్పింగ్ హోమ్ ద్వారా పాత వస్తువులు,పాత బట్టలు వితరణ



**-లంకా సేవాఫౌండేషన్ మధిర...**

**మధిర, నవంబర్ 2( మన వార్త)** మహనుభావులు ఇద్దరు ఒకరు వ్యాపారస్తులు, మరొకరు ప్రవేట్ కాలేజ్ లెక్చరర్... ప్రముఖ సంఘ సేవకులు లంకా కొండయ్య నిర్వహిస్తున్న హెల్పింగ్ హోమ్ కు వారి ఇంటిలో ఉన్న పాత వస్తువులు మంచము లో నుండి లేచి నిల బడలేని వారికి వాకర్ స్టాండ్, వాటర్ బాటిల్ స్టీల్ దాతలు వితరణ చేయగా చెప్పులు కుట్టే గద్దల లక్ష్మయ్య కు లంక కొండయ్య బృందం వారి ఇంటికి వెళ్లి మానవతా దృక్పథంతో ఈ రెండు వస్తువులు పంపిణి చెసినారు. ఇలా ఎవరి ఇంటిలోనైనా పాత వస్తువులు ఇంటిలో అటు ఇటు తిరగటానికి ఇబ్బంది కలిగిస్తున్నవైనా లేక వాడక డస్ట్ బట్టి ఎక్కడ పెట్టాలో తెలియటం లేదా ఐతే మాకు కాల్ చేయండి. ఏ వస్తువు ఐనా వెంటనే పేద మధ్య తర గతి కూటింబికులు లేదా అనరోగ్య బాధితులకూ వృద్ధులు కూ వితంతు మహిళలకు వలస కూలీలకు మా హెల్పింగ్ హోమ్ ద్వారా స్వచ్చాందంగా ఉచితంగా ఆ నిరుపేదలకు అందజేస్తాము. ఈ చిన్న సహాయం చేసిన దాతలకు లంకా కొండయ్య బృందం హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో దేవాలయాల భూమి పూజ

**గజ్వేల్ నవంబర్ 02 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామి మరియు పోచమ్మ దేవాలయాల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీటీసీ రామచంద్రం



యాదవ్, యాదవ సంఘం సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ రవీందర్ యాదవ్, వనం మల్లేష్ యాదవ్ పత్తి బాబు యాదవ్, కౌన్సిలర్ పంబాల శివకుమార్, చీర్ల మల్లేష్ యాదవ్, శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు దువ్వల బిక్షపతి యాదవ్, ప్రధాన కార్యదర్శి ఏక్కల దేవి కనకరాజ్ యాదవ్,కార్య నిర్వహణ అధ్యక్షుడు చీర్ల యాదగిరి, రొట్టెల శ్రీనివాస్ , రొట్టెల ఐలేష్ యాదవ్, లింగం యాదవ్, నాగరాజు యాదవ్, కృష్ణ యాదవ్, యాదవ్, కడారి ఐలయ్య యాదవ్, గట్టు రమేష్ యాదవ్, కటికం స్వామి యాదవ్, దువ్వల శ్రీనివాస్ యాదవ్, మంద నరేష్ యాదవ్, కొరమైన రమేష్ కుల బాంధవులు పెద్దలు రొట్టెల ఐలయ్య యాదవ్, కొనమైన రాజయ్య యాదవ్, మలమైన మల్లేష్ యాదవ్ మంద సదానందం యాదవ్, దువ్వల ఎల్లేష్ యాదవ్, కుల బాంధవులు చిన్నారులు పెద్దలు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు .

## వరదరాజపురం ఆంజనేయస్వామి ఆలయంలో పూర్వాభాద్ర నక్షత్రం పూజలు

**–స్వామివారికి వెండి కవచం కిరీటం అలంకరణ...**

**గజ్వేల్ నవంబర్ 02 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వరదరాజపురం గ్రామంలో ఆదివారం పూర్వాభద్ర నక్షత్రం పురస్కరించుకొని, స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి, దాతల సహకారంతో స్వామివారికి వెండి కవచాలు కిరీటం అలంకరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ప్రొద్దుటూరు గోపాలకృష్ణ, శ్రీనివాస్ శర్మ, రామ్మోహన్ శర్మ,



అభిలాష్ గుప్తా మాట్లాడుతూ అందరికీ శ్రీ ఆంజనేయస్వామి కరుణ కటాక్షాలు ఉండాలని, వరదరాజపురం ఆంజనేయస్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం అని దాదాపు 52 నెలలుగా ప్రతినెల పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని దాతల సహకారంతో దాదాపు 13 కిలోల వెండితో స్వామివారి కవచం కిరీటం అలంకరించడం జరిగిందని ఇందుకు సహకరించిన దాతలకు స్వామివారి ఆశీర్వాదం ఉంటుందని అన్నారు, ఈ కార్యక్రమంలో అమర నాగేందర్,వెంకటేశం, అంతని నర్సింలు, చేతి రెడ్డి రంగారెడ్డి, గొడుగు నరసింహులు, మాచర్ల సిద్దేశ్వర, ఆర్యవైశ్యులు,మహిళలు, చిన్నారులు యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మైనంపల్లి హన్మంతరావు

**–మైనంపల్లి రోహిత్ జన్మదినం సందర్భంగా నాచారం దేవస్థానం లో ప్రత్యేక పూజలు...**

**గజ్వేల్ నవంబర్ 02 మన వార్త ప్రతినిధి** మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదినం సందర్భంగా



వర్గల్ మండలం నాచారం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మైనంపల్లి హన్మంతరావు ,నాచారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నాచారం దేవాలయం అభివృద్ధి చెందటానికి కృషి చేస్తానని మైనంపల్లి హన్మంతరావు హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో మెదక్ డిసిసి ఆంజనేయులు గౌడ్ మెదక్ జిల్లా గ్రంధాలయ చైర్మెన్ సుహాసిని రెడ్డి ,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బండారు శ్రీకాంత్ రావు,చిట్కుల మహిపాల్ రెడ్డి ,నాయిని యాదగిరి,సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ఎస్ సి సెల్ అధక్షుడు విజయ్ కుమార్,బంగారు రెడ్డి,హన్మంత రెడ్డి,శశిభూషణ్ రెడ్డి,గడ్డి వెంకటేష్ యాదవ్,నాచారం డైరెక్టర్లు సంతోష్ పంతులు,శ్రీనివాస్,వర్గల్ మండల కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య,సుల్తాన్ భాయ్,బిట్ల నవీన్,పిట్ల కృష్ణ,వెంకటేష్,శ్రీకాంత్,మహబూబ్,సాయికుమార్ ,భాస్కర్,భాను,నితిన్ రెడ్డి,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు మృతి...



**చిన్న శంకరంపేట నవంబర్ 2 ( మన వార్త ప్రతినిధి )**శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చిన్న శంకర్పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది,చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఆకుల వెంకమ్మ (105) ఆదివారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త కొన్నేల్ల కితమే మృతి చెందాడు. ఆమెకు ఒక కుమార్తె కలదు. మనవలు మునిమనవలను చూసిన ఆమె వృద్ధాప్య నేడు మృతి చెందారు.

## సమస్యల పరిష్కారానికి పోరాడేది ఎర్రజెండానే





**–సిపిఎం మండల కార్యదర్శి మందా సైదులు...**

**మధిర,నవంబర్ 2(మన వార్త):**ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి ప్రభుత్వంపై పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది సిపిఎం పార్టీనేనని సిపిఎం మండల కార్యదర్శి మందా సైదులు అన్నారు.ఆదివారం మధిర ముప్పు సమస్యలపై మేము ఫోన్ చేస్తే డిప్యూటీ సీఎం స్పందించారని కాంగ్రెస్ నేత మిర్యాల వెంకటరమణ గుప్తా స్టేట్మెంట్ పై సిపిఎం స్పందించింది.ఈ సందర్భంగా మందా సైదులు మాట్లాడుతూ,మొంథా తుఫాన్ కారణంగా మధిర పట్టణంలో ముస్లిం కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, హనుమాన్ కాలనీలల్లో రోడ్లపై,ఇండ్లలోకి నీళ్లు చేరితే ఆ కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని కాలనీల సందర్శనకు వెళ్లిన సిపిఎం బృందం ఆ కాలనీ వాసులతో కలిసి సిపిఎం వర్షంలో నిరసన చేపట్టిందని అన్నారు.దీని కారణంగానే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో దిగివచ్చిన ప్రభుత్వ యంత్రాంగం ముప్పు ప్రాంతం అయినా హనుమాన్ కాలనీ,ముస్లిం కాలనీ,ఎంప్లాయిస్ కాలనీలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ముప్పు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ సందర్శించారని సైదులు తెలిపారు.అయితే స్థానిక కాంగ్రెస్ నేత మిరియాల వెంకటరమణ గుప్తా డిప్యూటీ సీఎంకి మేమే ఫోన్ చేశాం మా కారణంగానే కాలనీల సమస్య పరిష్కారం అయిందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.మీరు ఫోన్ చేస్తే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పందించిన మాట నిజమే అయితే మంచిది మేము కూడా సిపిఎం పార్టీగా సంతోషిస్తాం అని అన్నారు.అయితే ప్రజా సమస్యలు అనేకం ఉన్నాయని వితంతువుల పెన్షన్,మధిర పట్టణంలో ధ్వంసం అయిన రోడ్లలో ప్రజలు నడవలేక ఇబ్బందులు పడుతున్నారని ప్రజల సమస్యల పరిష్కారం కోసం మీరు డిప్యూటీ సీఎంతొ ఫోన్ చేసి మాట్లాడాలని మీరు ఎప్పుడు ఫోన్ చేసి మాట్లాడతారో చెప్పాలని ఇక ప్రజలు పోరాటాల వైపు వెళ్లకుండా ఉంటారని అన్నారు.కాలనీ ప్రజలు అనేక వినతులు ఇచ్చారని అయినా సమస్యలు పరిష్కారం కాలేదని అందుకే పోరాటం వైపు ప్రజలు నడిచారని ఫోన్ కాల్ తో స్పందన రాదని అది ప్రజలకు తెలుసు అని హితవుపలికారు.

## ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలి..



**–రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు...**

**–జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు...**

**నిజాంపేట నవంబర్ 2 ( మన వార్త ప్రతినిధి )**నిజాంపేట మండలం కల్వకుంట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 18,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు, వరి ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు నిర్వాహకులు సహకరించాలని సూచించారు. రైతులు పంట తెచ్చిన రోజు రిజిస్టర్లలో ఏ రోజు తెచ్చారు, తెచ్చినప్పుడు ఎంత తేమశాతం ఉంది అనే వివరాలను నమోదు చేసుకుని, సీరియల్ నెంబర్ల వారీగా కొనుగోలు చేసి పంపించాలన్నారు. బరువు కొల్చే యంత్రాలు, తేమ యంత్రాలు అందుబాటులో ఉంచుకొని ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక సత్యనారాయణ వ్రతము...



**జమ్మికుంట, నవంబర్ 02( మన వార్త ప్రతినిధి):** పట్టణంలోని వెంకటాద్రి నగర్ లో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతము వేదపండితుల మంత్రోచ్చారణ తో అత్యంత వైభవంగా జరిగింది.భక్తులు సంప్రదాయ దుస్తులతో పాల్గొని భక్తి శ్రద్ధలతో వ్రతము చేశారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## బల్మూరి వెంకట్ బర్త్ డే వేడుకలు...




**జమ్మికుంట, నవంబర్ ( మన వార్త ప్రతినిధి):**కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ హుజూరాబాద్ అధ్యక్షుడు సలీం పాషా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలు జమ్మికుంట గాంధీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మరియు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అభిమానులు బాణసంచా పేల్చి జన్మదిన వేడుక సంబరాలు జరుపుకున్నారు. జమ్మికుంట శివాలయంలో మహా అన్నదాత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఎమ్మెల్సీ వెంకట్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఓల్లాల శ్రీనివాస్ డాన్ రమేష్ కృష్ణ, మోహన్ సలీం,పోతుల శ్రీనివాస్,గడ్డం రమేష్, శ్రీనివాస్, కోరేసదానందం,నరికె సుమన్, రమేష్, వంశి రెడ్డి,చింటూ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి లో "మన వార్త దినపత్రిక " ముఖ్య సమావేశం...

**హైదారాబాద్,నవంబర్ 02( మన వార్త ప్రతినిధి):** మన వార్త దినపత్రిక ముఖ్య సమావేశం భువనగిరి లో ఆదివారం నిర్వహించడం



జరిగింది.ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి పాత్రికేయులు హాజరైయ్యారు. పలు అముశాల గురించి చర్చించారు.ఈ సందర్భంగా పత్రిక యాజమాన్యం వారు మాట్లాడుతూ నిజాయితీగా నిష్పక్షపాతంగా ప్రజా సమస్యలను వార్తల ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు తెలియపర్చుతూ పరిష్కార దిశగా ముందుకు వెళ్తుందని అన్నారు. ఆ లక్ష్యంతో మన వార్త పత్రికను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలు తెలియ పరచడంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా మరింత ముందుకు తీసుకెళ్లాలని పాత్రికేయులకు సూచించారు. అనంతరం స్వర్ణగిరి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకులు అర్చనలు చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో పత్రిక సీ ఈ ఓ భూపతి సంతోష్,డైరెక్టర్ యెబుసి సంపత్,స్టేట్ ఇన్చార్జి బితోజు భాస్కరచారి, జిల్లాల ఇన్చార్జి లు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఆదివారం వర్షం ధాటికి నగర జీవనం స్తంభన




హైదరాబాద్ : రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షం నగర వాతావరణాన్ని చల్లబరచినా, రోడ్లపై వాహనదారులకు ఇబ్బందులు కలిగించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నమోదైంది.కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి, సూరారం, షాపూర్‌నగర్, జీడిమెట్ల, బాలానగర్, జగద్గిరిగుట్ట, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, సుచిత్ర ప్రాంతాల్లో వాన పడింది. అలాగే కూకట్‌పల్లి, హైదర్‌నగర్, జేఎన్టీయూ, మూసాపేట, ప్రగతినగర్, బాచుపల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, ఆల్విన్ కాలనీ, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, బొల్లారంలోనూ వర్షం కురిసింది.అల్వాల్, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట, మారేడ్‌పల్లి, యూసుఫ్‌గూడ, వెంకటగిరి, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్, రహమత్‌నగర్, అమీర్‌పేట, ఎర్రగడ్డ, కృష్ణానగర్, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోనూ వర్షం కురవడంతో పలుచోట్ల నీటి నిల్వలు ఏర్పడ్డాయి.అకస్మాత్తుగా కురిసిన వర్షంతో రోడ్లపై వాహనాలు నత్తనడకన కదలగా, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులు తీవ్రంగా ఇరుక్కుపోయారు. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిచిపోయినట్లు సమాచారం.

# ఆరోగ్యం మీద నిర్లక్ష్యం

## జీవన శైలి మార్పు తప్పనిసరి

ప్రస్తుత కాలంలో జీవన వేగం పెరిగిన కొద్దీ ఆరోగ్యంపై ప్రజల దృష్టి మాత్రం తగ్గిపోతోంది. ఆధునికత పేరుతో ఆహారపు అలవాట్లు మారిపోయాయి. ఇంటి వంటల కంటే బయట ఆహారాన్ని ఎక్కువగా ఆస్వాదించే ధోరణి పెరిగింది. తాత్కాలిక సౌకర్యాలకోసం మనిషి తన శరీరానికి అవసరమైన విశ్రాంతి, వ్యాయామం, సమతుల ఆహారాన్ని విస్మరిస్తున్నాడు. ఈ నిర్లక్ష్యం కారణంగా చిన్న వయసులోనే అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు పెరుగుతున్నాయి.ప్రతిరోజూ పనిలో ఒత్తిడి, గాడ్జెట్లకు బానిసైన జీవితం, నిర్దిష్ట సమయాల్లో ఆహారం తీసుకోకపోవడం ఇవన్నీ శరీరానికి భారీ ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో పనిచేసే యువత, ఉద్యోగస్తులు జీవన నాణ్యత కంటే జీవన సౌకర్యాలను ప్రాధాన్యంగా చూస్తున్నారు. దాంతో శరీరం అలసిపోతోంది, మానసిక ప్రశాంతత కోల్పోతోంది. సమాజం మొత్తంలో ఆరోగ్య అవగాహన పెంపొందించడం ఇప్పుడు అత్యవసరం.ప్రభుత్వం కూడా ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించే దిశగా సమగ్ర కార్యక్రమాలు చేపట్టాలి. ప్రాథమిక పాఠశాలల నుంచే శారీరక విద్య, ఆరోగ్య పరిరక్షణ పాఠాలు తప్పనిసరిగా బోధించాలి. పబ్లిక్ హెల్త్ సెంటర్లను బలోపేతం చేసి, ప్రతి వ్యక్తి వార్షిక ఆరోగ్య పరీక్ష చేయించుకునేలా అవగాహన కల్పించాలి. ఈ విధంగా ఆరోగ్య సంస్కృతి సమాజంలో బలపడుతుంది. మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమైనది. ఒత్తిడి, ఆందోళన, నిరాశ, డిప్రెషన్ వంటి సమస్యలు సైలెంట్‌గా మనుషుల మనసును నశింపజేస్తున్నాయి. కుటుంబాల్లో పరస్పర సంభాషణ తగ్గిపోవడం, సాంకేతికత అధికమవడం వల్ల ఈ సమస్యలు మరింత ముదురుతున్నాయి. రోజువారీ ధ్యానం, యోగా, లేదా చిన్న నడకలతోనే మనసు ప్రశాంతంగా ఉంచుకోవచ్చు.ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపడం అంటే జీవితం పట్ల నిర్లక్ష్యం చూపినట్టే. ప్రతి ఒక్కరూ తమ శరీరాన్ని తమకు అప్పగించబడిన బాధ్యతగా భావించాలి. ఆరోగ్యకర జీవనశైలి అనేది ఒక ఫ్యాషన్ కాదు, అది ఒక అవసరం. పౌష్టికాహారం, తగినంత నీరు, నిద్ర, వ్యాయామం ఇవి జీవన శక్తికి మూలస్తంభాలు.మహిళలు, వృద్ధులు, పిల్లలు అందరికీ సరైన ఆహారం, సమయానికి విశ్రాంతి చాలా అవసరం. ఇంటి వాతావరణం ఆరోగ్యకరంగా ఉంటే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుంది. మనం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం సజీవంగా ఉంటుంది. ఈ చైతన్యం ప్రతి ఇంటికి చేరాలి.కోవిడ్ మహమ్మారి మనకు ఒక పెద్ద పాఠం నేర్పింది ‌ఆరోగ్యం అంటే డబ్బుతో కొనే వస్తువు కాదని. వైద్యసదుపాయాలున్నా, ప్రాణం నిలబెట్టేది మన రోగనిరోధక శక్తే. కాబట్టి శరీరాన్ని బలంగా ఉంచుకోవడం కోసం జంక్‌ఫుడ్, మద్యం, ధూమపానం వంటి అలవాట్లను పూర్తిగా వదిలేయాలి.సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటేనే దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది. ప్రభుత్వాలు సదుపాయాలు కల్పించవచ్చు, కానీ వ్యక్తిగత చైతన్యం లేకపోతే ఆ ప్రయత్నాలన్నీ వృథా అవుతాయి. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది ఈరోజు నుంచే ఆరోగ్య మార్గం వైపు అడుగు వేయాలి.

# విద్యలోనే దేశ భవిష్యత్తు

దేశ భవిష్యత్తు పునాది విద్యపై నిలబడింది. విద్యా వ్యవస్థ బలంగా ఉంటేనే సమాజం అభివృద్ధి దిశగా దూసుకెళ్తుంది. కానీ నేటి పరిస్థితుల్లో భారత విద్యా రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. కొత్త విద్యా విధానం (NEP) ఆశాజనకంగా కనిపిస్తున్నప్పటికీ, దాని అమలులో వ్యత్యాసాలు, పాత పద్ధతుల ప్రభావం ఇంకా కొనసాగుతున్నాయి. పుస్తకాల ఆధారిత జ్ఞానం మాత్రమే కాకుండా, ఆచరణాత్మక నైపుణ్యాల పెంపు, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంచే విధంగా మార్పులు రావాల్సి ఉంది.ప్రైవేట్ స్కూల్స్ ఆధిపత్యం పెరగడం మరో ఆందోళనకర విషయం. ప్రభుత్వ పాఠశాలల నాణ్యత క్రమంగా తగ్గిపోవడం వల్ల మధ్యతరగతి కుటుంబాలు అధిక ఫీజులు చెల్లించి ప్రైవేట్ విద్యను ఎంచుకుంటున్నాయి. ఫలితంగా విద్య వ్యాపారంగా మారిపోయింది. అగ్రవర్గం కోసం ఆధునిక సదుపాయాలతో కూడిన పాఠశాలలు ఉండగా, పేద పిల్లలకు మౌలిక సౌకర్యాలు కూడా అందని పరిస్థితి నెలకొంది. ఇది సమాన విద్య హక్కును దెబ్బతీస్తుంది.ఉన్నత విద్యా రంగంలో కూడా పరిస్థితి అంత భిన్నంగా లేదు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు తగిన వాతావరణం లేదు. ప్రొఫెసర్ల కొరత, లాబ్ సదుపాయాల లోపం, కోర్సులు కాలానికి అనుగుణంగా మారకపోవడం వంటి సమస్యలు విద్యార్థుల సామర్థ్యాలను పరిమితం చేస్తున్నాయి. గ్లోబల్ స్థాయిలో పోటీపడే ప్రతిభను పెంపొందించాలంటే విద్యా వ్యవస్థలో సంస్కరణలు అత్యవసరం.%చీజూ% 2020 పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర మార్పులను సూచించినా, రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడం దాని ప్రభావాన్ని తగ్గిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాలు లేకపోతే, ఈ విధానాలు కేవలం పట్టణాలకే పరిమితం అవుతాయి. సాంకేతికతను ఆధారంగా తీసుకుని డిజిటల్ లెర్నింగ్ ప్రోత్సహించడం అవసరం, కానీ అందుకు ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్, పరికరాలు అందుబాటులో ఉండాలి.విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం కాదు, మనిషి వ్యక్తిత్వ వికాసం కోసం. ఈ భావనను మనం మర్చిపోతున్నాం. పరీక్షల కోసం చదవడం, మార్కుల కోసం పోటీ పడడం, జ్ఞానానికి బదులుగా సర్టిఫికెట్‌ల కోసం పరిగెత్తడం ఇవే నేటి విద్యార్థుల వాస్తవం. దీనివల్ల సృజనాత్మకత మసకబారుతోంది, ఆత్మవిశ్వాసం తగ్గిపోతోంది.మాతాపితలు కూడా తమ పిల్లలపై అధిక ఒత్తిడి పెడుతున్నారు. ప్రతి ఒక్కరూ ఇంజనీర్ లేదా డాక్టర్ కావాలని కోరుకోవడం తప్పు. ప్రతి పిల్లలో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుంది. దాన్ని గుర్తించి ప్రోత్సహించాలి. క్రీడలు, కళలు, సాంకేతికత, సేవా రంగం ఇవన్నీ దేశ అభివృద్ధికి సమానంగా అవసరమైన రంగాలే.ప్రభుత్వం విద్యా రంగంలో పెట్టుబడులను పెంచి, ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా మార్చాలి. గురువుల శిక్షణ, ఆధునిక బోధనా పద్ధతులు, పాఠ్యపుస్తకాల నవీకరణ, విద్యార్థి–గురువు నిష్పత్తి సరిచేయడం వంటి చర్యలు తప్పనిసరి. విద్యా సమానత్వం సాధించకపోతే సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి.విద్య వ్యవస్థ ఎటు వెళ్తుందనే ప్రశ్న మనందరికీ ఆలోచన కలిగించాలి. జ్ఞానం, విలువలు, నైపుణ్యాలు కలిసిన విద్యే దేశ భవిష్యత్తు. ఈ దిశగా పాలకులు, గురువులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ సమష్టిగా కృషి చేయాలి. ఎందుకంటే ఒక తరానికి ఇచ్చే మంచి విద్యే, మరో తరానికి ఇచ్చే అత్యంత విలువైన బహుమతి.

# వాట్సాప్ మెసేజ్‌తో కుప్పకూలిన వ్యక్తి...




**–రూ.22 కోట్ల ట్యాక్స్ నోటీసు!**

**న్యూఢిల్లీ** నేటి కాలంలో వాట్సాప్ మన జీవితంలో అంతర్భాగమైపోయింది. స్నేహితులు, బంధువులు, సహచరులతో రోజు వందలాది మెసేజ్‌లు పంపించుకోవడం సహజమే. కానీ ఒక వ్యక్తికి మాత్రం ఆ వాట్సాప్ చాట్‌నే జీవితం మీద దెబ్బతీసింది. ఏకంగా రూ.22 కోట్లకు సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసులు అందడంతో షాక్ అయ్యాడు. కారణం అతని పేరుతో ఉన్న ఒక వాట్సాప్ చాట్!ఢిల్లీకి చెందిన ఆ వ్యక్తి పేరు ఒక రియల్ ఎస్టేట్ కంపెనీపై ఐటీ దాడుల్లో బయటపడిన మొబైల్ డేటాలో కనిపించింది. అందులో పెట్టుబడులు, వడ్డీలు, 'రిటర్న్ స్కీమ్'కు సంబంధించిన వివరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ చాట్ ఆధారంగా సదరు వ్యక్తి రూ.22 కోట్లు పెట్టుబడి పెట్టారని భావించిన ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖ ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 153%జ%, 69 కింద నోటీసులు జారీ చేసింది.అయితే ఆ వ్యక్తి ఈ ఆరోపణలను ఖండిస్తూ "వాట్సాప్ చాట్ నా ఫోన్ నుంచి కాదు, ఇతరుల నుంచి తీసుకున్న డేటా మాత్రమే. ఇది ఎలాంటి చట్టపరమైన సాక్ష్యం కాదు" అని వాదించాడు. కేసు చివరకు ఢిల్లీ ఇన్‌కమ్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యునల్ వద్దకు వెళ్లింది.దర్యాప్తులో ట్రిబ్యునల్ కీలక వ్యాఖ్యలు చేసింది. "డిజిటల్ డేటా లేదా వాట్సాప్ చాట్‌లు మాత్రమే సాక్ష్యాలు కావు. వాటికి మద్దతుగా ఒప్పందాలు, పత్రాలు ఉండాలి" అని స్పష్టం చేసింది. ఎన్వలప్‌లలో ఉన్న పేర్లు స్పష్టంగా లేకపోవడంతో కేసును కొట్టివేసింది.దీంతో ఆ వ్యక్తి ఊపిరిపీల్చుకున్నాడు. అయితే ఈ ఘటన ఒక హెచ్చరికగా మారింది "వాట్సాప్‌లో ఏమి రాస్తున్నామో జాగ్రత్త.. అవి కోర్టులోనూ సమస్యలు తెచ్చిపెట్టవచ్చు!"

# వచ్చే వారం ఫోకస్ చేయాల్సిన 2 పీఎస్యూ స్టాక్స్!



**ముంబై :** ప్రముఖ దలాల్ స్ట్రీట్ బ్రోకరేజ్ సంస్థ ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌కు చెందిన సాంకేతిక విశ్లేషకుడు ధర్మేశ్ షా, వచ్చే వారం పెట్టుబడిదారులు దృష్టి పెట్టాల్సిన రెండు లార్జ్ క్యాప్ పబ్లిక్ సెక్టార్ కంపెనీలను సూచించారు. ఈ రెండు పీఎస్యూ షేర్లకు కొనుగోలు సూచనతో పాటు లక్ష్య ధర, నష్టనివారణ ధరలను కూడా ప్రకటించారు. ఈ షేర్లలో పెట్టుబడి పెట్టడం లాభదాయకమవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ జాబితాలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉన్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ధర్మేశ్ షా ప్రకారం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేరుకు రూ.179 లక్ష్య ధర, రూ.154 నష్టనివారణ ధర సూచించారు.శుక్రవారం ముగిసిన మార్కెట్ లావాదేవీలలో ఈ షేరు 1.68 శాతం పెరిగి రూ.166.25 వద్ద ముగిసింది.52 వారాల గరిష్ట ధర రూ.167.10, కనిష్ట ధర రూ.110.72గా నమోదైంది.గత ఏడాదిలో ఈ కంపెనీ షేరు 20 శాతం లాభాన్ని వాటాదారులకు అందించింది.ప్రస్తుతం ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.2.34 లక్షల కోట్లుగా ఉంది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఈ షేరుకు ధర్మేశ్ షా రూ.466 లక్ష్య ధర, రూ.398 నష్టనివారణ ధర సూచించారు.శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి ఈ షేరు 3.98 శాతం పెరిగి రూ.426.20 వద్ద నిలిచింది.52 వారాల గరిష్ట ధర రూ.436, కనిష్ట ధర రూ.240.25గా ఉంది.గత ఏడాదిలో ఈ కంపెనీ షేరు 50 శాతం లాభాన్ని వాటాదారులకు అందించింది.ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.3.12 లక్షల కోట్లుగా ఉంది.ధర్మేశ్ షా వ్యాఖ్యానిస్తూ "ఈ రెండు పీఎస్యూ సంస్థల షేర్లు సాంకేతికంగా బలమైన స్థితిలో ఉన్నాయి. దీర్ఘకాలిక పెట్టుబడిదారులు వీటిని పరిశీలించవచ్చు. వచ్చే వారాల్లో మంచి లాభాల అవకాశముంది" అన్నారు.రాబోయే వారం మార్కెట్లో పెట్టుబడిదారుల దృష్టి ఈ రెండు లార్జ్ క్యాప్ పీఎస్యూ షేర్లపైనే కేంద్రీకృతం కానుంది.

# భారత గిరిజన సమాజంపై ప్రధాని మోదీకి అపార గౌరవం




**–దేశవ్యాప్తంగా ప్రశంసలు...**

**న్యూఢిల్లీ :** భారత గిరిజన సమాజంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చూపుతున్న గౌరవం, ప్రేమ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గిరిజనుల అభ్యున్నతికి, సాంస్కృతిక వారసత్వ సంరక్షణకు ప్రధాని మోదీ తీసుకుంటున్న చర్యలు ఇప్పటివరకు ఎవరూ చూపని స్థాయిలో ఉన్నాయని రాజకీయ వర్గాలు, సామాజిక సంస్థలు ప్రశంసిస్తున్నాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అనేక కీలక కార్యక్రమాలు చేపట్టింది. 'జనజాతి గౌరవ దివస్'ను జాతీయ స్థాయిలో నిర్వహించడం, గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు స్మారకాలను నిర్మించడం, గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక వసతి గృహాలు, పాఠశాలలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు ఆయన గిరిజన సమాజంపై ఉన్న గౌరవాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి."గిరిజన సమాజం భారతదేశపు ఆత్మను ప్రతిబింబిస్తుంది. వారి సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మికత దేశ గౌరవానికి బలమైన పునాది" అని మోదీ తరచూ పేర్కొంటున్నారు. ఆయన నాయకత్వంలో గిరిజన ప్రాంతాల రహదారులు, విద్య, వైద్య సదుపాయాలు, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా కొనసాగుతోంది. ప్రధాని మోదీ చూపుతున్న గిరిజన సమాజ గౌరవం ఇతర నాయకులకు ఆదర్శంగా నిలుస్తోందని, ఆయన దృష్టిలో ప్రతి గిరిజనుడు దేశాభివృద్ధిలో భాగస్వామి అని కేంద్ర మంత్రులు పేర్కొన్నారు. దేశ సాంస్కృతిక వైవిధ్యంలో గిరిజనులు ముఖ్యమైన భాగమని ప్రధాని మోదీ మళ్లీ మళ్లీ స్పష్టం చేస్తున్నారు.

# మియాపూర్‌లో అక్రమ కట్టడంపై హైడ్రా ధాటీ




**–5 అంతస్తుల భవనాన్ని నేలమట్టం...**

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కఠిన వైఖరి అవలంబిస్తోంది. అదే క్రమంలో, మియాపూర్ పరిధిలో ప్రభుత్వ భూమిపై అక్రమంగా నిర్మించబడిన ఐదు అంతస్తుల భారీ భవనాన్ని హైడ్రా అధికారులు శనివారం బుల్డోజర్లతో కూల్చివేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి వందల గజాల నిర్మాణం చేపట్టిన భాను కన్స్ట్రక్షన్స్ యజమానులపై అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే ం అమీన్పూర్ సర్వే నంబర్లు 337, 338లలో హుడా ఆమోదించిన లే–అవుట్‌లో 400 గజాల 126 నెంబర్ ప్లాట్ కొనుగోలు చేసిన భాను కన్స్ట్రక్షన్స్ యజమానులు, పక్కనే ఉన్న మియాపూర్ సర్వే నంబర్ 101లోని ప్రభుత్వ భూమిలోకి చొరబడి, 126/D, 126/C, 126/Part నంబర్ల పేర్లతో కొత్త ప్లాట్లు సృష్టించారు. ఆ భూమి హైదరాబాదు మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధీనంలో ఉండటంతో, ఇది ప్రభుత్వ ఆస్తి అని అధికారులు గుర్తించారు. అదేవిధంగా, మొత్తం 873 గజాల మేర విస్తీర్ణంలో ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించడమే కాకుండా, పత్రాలను కూడా నకిలీగా సృష్టించినట్టు విచారణలో తేలింది. వారు సమర్పించిన డిమాండ్ డ్రాఫ్ట్ కూడా ఫేక్ అని అధికారులు నిర్ధారించారు. 2014లోనే ఈ నకిలీ పత్రాలను తయారు చేసినట్టు రికార్డుల్లో బయటపడింది. ఈ అక్రమ చర్యలపై HMDA అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేయగా, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసింది. రెవెన్యూ, మున్సిపాలిటీ, HMDA అధికారులతో కలిసి భవనం స్థలాన్ని పరిశీలించగా, 473 గజాల మేర ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరిగిందని స్పష్టమైంది. అనంతరం హైడ్రా బృందం భారీ యంత్రాలను ఉపయోగించి భవనాన్ని పూర్తిగా కూల్చివేసింది. హైడ్రా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిపై అక్రమంగా కట్టడాలు నిర్మించేవారిపై భవిష్యత్తులో మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేసిన వారిని విడిచిపెట్టేది లేదు. నగర భూమి రక్షణలో హైడ్రా పాత్ర దృఢంగా కొనసాగుతుంది" అని కమిషనర్ ఏ.వి. రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రజా భూమిని ఆక్రమించి లాభాలు పొందేందుకు ప్రయత్నించే రియల్ ఎస్టేట్ మాఫియాపై ఈ చర్య బలమైన సందేశంగా మారింది. మియాపూర్ ప్రాంత ప్రజలు హైడ్రా అధికారుల చర్యను స్వాగతించి, ఇలాంటి అక్రమ నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు.

# పోస్టర్లకే పరిమితమైన స్వచ్ఛ భారత్!



**–చెత్తలో మునిగిన పట్టణాలు..**
**–ఎక్కడుంది స్వచ్ఛ భారత్...?**

**డెస్క్ :** స్వచ్ఛ భారత్ మిషన్ అంటూ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ దేశాన్ని శుభ్రంగా మార్చాలని కేంద్రం ప్రకటించినప్పటికీ, పట్టణాల పరిస్థితి మాత్రం విరుద్ధంగా ఉంది. రోడ్లపై చెత్త కుప్పలు, నిక్షేపాలు, దుర్వాసనలతో నగర జీవనం మానవ సహనానికి మించిన స్థాయికి చేరింది. వర్షం పడితే నీరు నిలిచిపోవడం, చెత్తతో మురుగునీరు కలవడం ప్రజారోగ్యానికి పెద్ద ప్రమాదంగా మారింది.ప్రభుత్వాలు, మున్సిపల్ అధికారులు పెద్దఎత్తున ప్రచారం చేస్తారు కానీ అమలు మాత్రం లేకుండా పోతుంది. చెత్త సేకరణ వాహనాలు సమయానికి రాకపోవడం, ప్రజలు కూడా అవగాహన లేకుండా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల పరిస్థితి మరింత దారుణమవుతోంది. నగర కేంద్రాల్లో కూడా రోడ్ల పక్కన చెత్త బుట్టలు పొంగిపోతూ ఉండటం సాధారణ దృశ్యంగా మారింది.స్వచ్ఛ భారత్ నినాదం కేవలం పోస్టర్ల మీదే మిగిలిపోయింది. శుభ్రతపై అవగాహన కల్పించాల్సిన సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అనేక కాలనీల్లో డంప్ యార్డులు పక్కనే పాఠశాలలు, ఆసుపత్రులు ఉండడం ఆరోగ్య ప్రమాదాలను పెంచుతోంది.ప్రజలు, అధికారులు రెండూ బాధ్యతతో ముందుకు రావాలి. చెత్త సమస్యను చిన్న విషయం అనుకోవడం పెద్ద తప్పు. ఇది కేవలం శుభ్రతకే కాదు, ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి సంబంధించిన అంశం. ప్రతి కుటుంబం చెత్తను సక్రమంగా వేరు చేయడం, మున్సిపల్ శాఖలు సమయానికి సేకరించడం తప్పనిసరి చేయాలి.ప్రభుత్వం కూడా పట్టణ శుభ్రతపై కఠిన నియంత్రణ వ్యవస్థను అమలు చేయాలి. జరిమానాలు విధించడం, సీసీ కెమెరా పర్యవేక్షణ, స్మార్ట్ చెత్త సేకరణ వంటి ఆధునిక చర్యలు తప్పనిసరిగా ఉండాలి. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ భారత్‌హొకల నిజమవుతుంది.

# భక్తి కి భద్రత కరువు...

**– భయం పుట్టిస్తున్న దేవాలయాలు!**
**– ప్రతీసారి అదే దృశ్యం బలైపోతున్న భక్తులు...**
**– దేవాలయాల్లో భద్రతా చర్యలు తప్పనిసరి...**

**శ్రీకాకులం :** దేవుడిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం దేశానికి శోచనీయ విషయం. నిన్న శ్రీకాకులం జిల్లా కాసిబుగ్గలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో చోటుచేసుకున్న తొక్కిసలాట మళ్లీ ఒక చేదు సత్యాన్ని వెలుగులోకి తెచ్చింది



ం దేవాలయాల్లో భద్రతా ఏర్పాట్లు ఎంత నిర్లక్ష్యంగా జరుగుతున్నాయో ఇది మరోసారి రుజువు చేసింది. భక్తుల ఉత్సాహం, అధికారులు చూపిన నిర్లక్ష్యం కలిసి ప్రాణాలను బలిగొన్నాయి.ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా తిరుమల, సబరిమల, పాండురంగ క్షేత్రం వంటి ప్రముఖ దేవాలయాల్లో కూడా తొక్కిసలాటలు జరిగి వందలాది ప్రాణాలు కోల్పోయారు. పండుగలు, ప్రత్యేక దినాలు, ఏకాదశి వంటి సందర్భాల్లో భక్తుల రద్దీ పెరుగుతుందని తెలిసినా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దుర్ఘటనలు జరుగుతున్నాయి. ప్రాణాలకు విలువ లేకుండా దేవాలయ నిర్వహణలు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం కేవలం పరిహారం ప్రకటించడం కాకుండా, దేవాలయాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలులోకి తేవాలి. భక్తుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా గుర్తించి, రద్దీని నియంత్రించే క్రమంలో తగిన సిబ్బంది నియమించాలి. ఎక్కడైనా ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకునే వ్యవస్థ ఉండాలి.ప్రజలకూ అవగాహన అవసరం. ఒకే సారి వేలమంది పరుగెత్తి వెళ్లడం, తోపులాట చేయడం అనేది ప్రమాదానికి దారి తీస్తుంది. భక్తి పూజలతో పాటు శాంతియుత ప్రవర్తన కూడా అంతే ముఖ్యం అని గుర్తుంచుకోవాలి. ప్రభుత్వం, దేవస్థాన అధికారులు, భక్తులు ఈ ముగ్గురూ తమ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తేనే భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు నివారించవచ్చు.

## రూ.2000 నోట్లపై ఆర్బీఐ కొత్త ప్రకటన



**న్యూఢిల్లీ :** పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత విలువైన కరెన్సీగా పరిచయమైన రూ.2000 నోట్లు మళ్లీ వార్తల్లోకి వచ్చాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) తాజాగా విడుదల చేసిన ప్రకటనతో ఈ పెద్ద నోట్లపై మరోసారి చర్చ మొదలైంది. 2016 నవంబర్‌లో జరిగిన నోట్ల రద్దు అనంతరం రూ.2000, రూ.500 నోట్లను ఆర్‌బీఐ చలామణిలోకి తీసుకొచ్చింది. అయితే, ఆ తర్వాత ఈ పెద్ద నోట్ల అవసరం తగ్గిపోవడంతో 2023 మే 19న రూ.2000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. అప్పటి వరకు మార్కెట్లో దాదాపు రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయని పేర్కొంది. గడిచిన రెండేళ్లలో ఆ నోట్లు దాదాపు అన్నీ బ్యాంకులకు తిరిగి వచ్చాయి. కానీ తాజాగా విడుదల చేసిన ఆర్‌బీఐ నివేదిక ప్రకారం, ఇప్పటికీ ప్రజల వద్ద రూ.5,817 కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయని వెల్లడించింది. అంటే మొత్తం నోట్లలో 98.37 శాతం ఇప్పటికే బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేరగా, మిగిలిన 1.63 శాతం నోట్లు ఇంకా మార్కెట్లో, లేదా వ్యక్తుల వద్దే ఉన్నట్లు అర్థమవుతోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆర్‌బీఐ నోటీసు ఇచ్చిన రెండున్నరేళ్ల తర్వాత కూడా ఈ నోట్లు పూర్తిగా తిరిగి రాకపోవడం. కొందరు ఈ నోట్లు అనుకోకుండా ఇళ్లలో ఉంచి మర్చిపోయి ఉండవచ్చు, మరికొందరు స్మారకంగా దాచుకున్నట్లు సమాచారం. ఇంకా ఈ నోట్లు మీ దగ్గర ఉన్నట్లయితే ఆందోళన అవసరం లేదు. రిజర్వ్ బ్యాంక్ స్పష్టంగా తెలిపింది రూ.2000 నోట్లను ఇప్పటికీ మార్చుకునే అవకాశం ఉంది. అందుకోసం మీరు హైదరాబాద్‌లోని ఆర్‌బీఐ కార్యాలయం లేదా సమీప రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించవచ్చు. నోట్లను సమర్పిస్తే, అంతకు సమానమైన మొత్తం మీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుంది. అదే కాకుండా, స్పీడ్ పోస్ట్ ద్వారా కూడా ఈ నోట్లు పంపి మార్పిడి చేసుకునే అవకాశం ఉందని ఆర్‌బీఐ వెల్లడించింది. ఈ ప్రక్రియ పూర్తిగా సురక్షితమని, డబ్బులు మీ ఖాతాలోనే జమ అవుతాయని అధికారులు తెలిపారు. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, పెద్ద నోట్ల చలామణి తగ్గడం ద్రవ్యప్రసరణ నియంత్రణకు దోహదం చేస్తుందని చెబుతున్నారు. అయినా కూడా, ప్రజల వద్ద ఇంకా వేల కోట్ల రూపాయల విలువైన రూ.2000 నోట్లు ఉండటం ఆర్థిక వ్యవస్థలో ఆశ్చర్యకర అంశంగా మారింది. దేశవ్యాప్తంగా మళ్లీ రూ.2000 నోట్లపై చర్చ మొదలవగా, ఆర్‌బీఐ తాజా గణాంకాలు చర్చనీయాంశమయ్యాయి.

## ఐటీ కంపెనీ బంపర్ ఆఫర్ ఒక్క రూపాయి షేర్‌కి 5 ఉచితం!




**ముంబై :** స్మాల్ క్యాప్ ఐటీ కంపెనీ సిల్ఫ్ టెక్నాలజీస్ లిమిటెడ్ తమ వాటాదారులకు బంపర్ గిఫ్ట్ ప్రకటించింది. షేర్ మార్కెట్లో ఇటీవల అంతంత మాత్రంగా నడుస్తున్నప్పటికీ, ఈ సంస్థ బోనస్ షేర్ల జారీ నిర్ణయంతో మదుపరుల దృష్టిని ఆకర్షించింది. అక్టోబర్ 27న జరిగిన బోర్డు సమావేశంలో కంపెనీ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. కంపెనీ ప్రకటించిన ప్రకారం, ఎవరు 11 ఈక్విటీ షేర్లు కలిగి ఉన్నారో వారికి అదనంగా 5 బోనస్ షేర్లు ఉచితంగా లభించనున్నాయి. అంటే 5:11 రేషియోలో బోనస్ షేర్లు ఇస్తున్నట్లు అర్థం. రికార్డు తేదీ నాటికి షేర్లు కలిగి ఉన్న ఇన్వెస్టర్లు ఈ ఆఫర్‌కు అర్హులు అవుతారు. త్వరలోనే రికార్డు డేట్ ప్రకటించనున్నట్లు సిల్ఫ్ టెక్నాలజీస్ తెలిపింది. ఈ షేరు ధర రూ.1 ఫేస్ వ్యాల్యూ కలిగి ఉంది. శుక్రవారం ముగిసిన ట్రేడింగ్ సెషన్‌లో షేరు ధర 2.6 శాతం పెరిగి రూ.0.77 వద్ద ముగిసింది. గత ఏడాదిలో ఈ షేర్ 25 శాతం నష్టపోయినప్పటికీ, గత ఐదేళ్లలో మాత్రం 126 శాతం లాభం ఇచ్చిన కంపెనీగా సిల్ఫ్ గుర్తింపు పొందింది. ఈ షేరు 52 వారాల గరిష్టం రూ.1.46, కనిష్ఠం రూ.0.69 వద్ద ఉంది. గత వారం రోజుల్లో 5 శాతం నష్టపోయిన ఈ షేరు, గత నెలలో 1 శాతం లాభపడింది. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపిన వివరాల ప్రకారం, బోనస్ షేర్ల జారీకి డైరెక్టర్ల బోర్డు ఇప్పటికే ఆమోదం తెలిపింది. రికార్డు డేట్ ప్రకటించగానే మదుపరులు ఈ ఆఫర్ లాభం పొందవచ్చు. స్టాక్ పనితీరు జాగ్రత్తలు: స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవే. బోనస్ షేర్లు ఉన్నా గాని గ్యారంటీ లాభాలు రావు. నిపుణుల సలహా తీసుకుని మాత్రమే పెట్టుబడులు పెట్టాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. కంపెనీ ఫండమెంటల్స్, మార్కెట్ ట్రెండ్స్ పరిశీలించి దీర్ఘకాలిక దృష్టితో ఇన్వెస్ట్ చేస్తేనే మంచి లాభాలు పొందవచ్చు.

## జీఎస్టీ రేట్లు తగ్గినా రూ.2 లక్షల కోట్లు వసూలు




**న్యూఢిల్లీ :** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో కేంద్రానికి వరుసగా శుభవార్తలు అందుతున్నాయి. పన్ను రేట్లు తగ్గించినా కూడా వసూళు దూసుకుపోతున్నాయి. అక్టోబర్ నెలలో ప్రజల కొనుగోళ్లు, పండగ సీజన్ అమ్మకాలు కలిసి ప్రభుత్వ ఖజానాకు బంగారు ఫలితాలనిచ్చాయి. ఈ నెలలో ఏకంగా రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదవడంతో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టతను మరోసారి నిరూపించాయి. ఇది ఇప్పటివరకు రెండో అత్యధిక వసూళ్లుగా రికార్డయిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈసారి వసూళ్లు 4.6 శాతం మేర పెరిగాయి. సెప్టెంబర్ 22నుంచి కిచెన్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్ రంగానికి చెందిన 375 వస్తువులపై కేంద్రం జీఎస్టీ రేట్లను తగ్గించింది. రేట్లు తగ్గినా కొనుగోళ్లు మాత్రం భారీ స్థాయిలో జరిగాయి. దసరా, దీపావళి పండుగల సమయం కావడంతో వినియోగదారులు భారీగా ఖర్చు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో "దీపావళికి ముందే జీఎస్టీ శుభవార్త వినిపిస్తాం" అని చెప్పడంతో కొనుగోళ్లు వాయిదా వేసుకున్న వారంతా అక్టోబర్‌లో సొంత షాపింగ్‌ను పూర్తి చేశారు. దీని ఫలితంగా ప్రభుత్వ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. గతేడాది అక్టోబర్‌లో రూ.1.87 లక్షల కోట్లు వసూలయితే, ఈసారి రూ.1.96 లక్షల కోట్లకు పెరిగాయి. ఆగస్టులో రూ.1.86 లక్షల కోట్లు, సెప్టెంబర్‌లో రూ.1.89 లక్షల కోట్లు నమోదయ్యాయి. అంటే వరుసగా మూడు నెలల్లోనూ వసూళ్లు పెరుగుతూ రావడం గమనార్హం. అక్టోబర్ నెలలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగానికి సంబంధించినవి కాగా, రూ.50,884 కోట్లు దిగుమతులపై సుంకాల రూపంలో వచ్చాయి. జీఎస్టీ రీఫండ్స్ రూ.26,934 కోట్లు చెల్లించిన తర్వాత నికర వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా ఉన్నాయి. జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయికి చేరడం ప్రభుత్వానికి ఆర్థిక స్థిరత్వానికి సంకేతమని ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. "జీఎస్టీ రేట్లు తగ్గించినా కొనుగోళ్లు తగ్గలేదు.. ఇది వినియోగదారుల నమ్మకం, మార్కెట్ ఉత్సాహం పెరుగుతోందనే సూచన" అని వారు పేర్కొన్నారు. దేశ ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని, జీఎస్టీ కలెక్షన్లు కూడా వృద్ధి దిశలో సాగుతున్నాయని కేంద్రం తెలిపింది. పండగ సీజన్ ప్రభావంతో నవంబర్‌లో కూడా వసూళ్లు ఈ రికార్డును మించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

## మహిళలకు గుడ్‌న్యూస్ తగ్గిన బంగారం ధరలు



**హైదరాబాద్ :** బంగారం కొనుగోలు చేయాలనుకునే మహిళలకు అదిరే శుభవార్త! ఇటీవల ఒక్కసారిగా పెరిగిన బంగారం ధరలు మళ్లీ తగ్గిపోయాయి. దీంతో వినియోగదారులకు పెద్ద ఊరట లభించింది. ఈరోజు హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ.280 మేర తగ్గి రూ.1,23,000 వద్దకు దిగివచ్చింది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.250 మేర తగ్గి రూ.1,12,750 వద్దకు చేరింది. అయితే, వెండి మాత్రం విరుద్ధ దిశలో కదిలింది. ఇవాళ వెండి ధర రూ.1,000 మేర పెరిగి కిలోకు రూ.1,66,000 వద్దకు చేరింది. బంగారం ధరలు పండుగల సీజన్‌లో తగ్గడంతో, జ్యువెలరీ షాపుల్లో మళ్లీ కస్టమర్ల రద్దీ పెరగనుంది. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రూ.40 కోట్ల క్లబ్‌లో 'కె ర్యాంప్'




**హైదరాబాద్ :** దీపావళి పండుగ కానుకగా విడుదలైన కిరణ్ అబ్బవరం చిత్రం 'కె ర్యాంప్' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసిన ఈ సినిమా తాజాగా రూ.40 కోట్ల క్లబ్‌లోకి చేరింది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రేక్షకుల ప్రేమకు కృతజ్ఞతలు తెలిపింది.తొలిసారిగా మెగాఫోన్ పట్టిన డెబ్యూ దర్శకుడు జైన్స్ నాని రూపొందించిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా యువతరం థియేటర్లకు క్యూ కడుతూ సినిమా విజయాన్ని సెలబ్రేట్ చేస్తున్నారు. కిరణ్ అబ్బవరం అభిమానులు సోషల్ మీడియాలో ఈ విజయాన్ని పండుగలా జరుపుకుంటున్నారు.ఈ చిత్రంలో యుక్తి తరేజా కథానాయికగా నటించగా, రాజేశ్ దండా నిర్మాణం వహించారు. సాయికుమార్, నరేష్ కీలక పాత్రల్లో మెప్పించారు.కథ ఏమిటంటే కుమార్ (కిరణ్ అబ్బవరం) పుట్టుకతోనే సంపన్నుడు. తండ్రి కృష్ణ (సాయికుమార్) అతన్ని అతి ప్రేమతో పెంచుతాడు. సౌకర్యాలన్నీ ఉన్నా కుమార్ నిర్లక్ష్యంగా జీవిస్తాడు. చదువులో ఆసక్తి చూపక, ఎప్పుడూ మద్యం మత్తులోనే గడుపుతుంటాడు. దాంతో కుమార్‌ని దారిలో పెట్టాలనే ఉద్దేశంతో కేరళలోని ఒక కాలేజీలో చేర్పిస్తారు. అక్కడ లిమెర్సీ జాయ్ (యుక్తి తరేజా)లిను చూసి తొలి చూపులోనే ప్రేమలో పడిపోతాడు. కానీ ఆమెకు ఒక మానసిక సమస్య ఉంటుంది. ఆ సమస్య ఏంటి? దానివల్ల ఈ ప్రేమకథ ఎలాంటి మలుపు తిరిగింది? అనేదే సినిమా ఆసక్తికర అంశం.సరికొత్త కథ, హృద్యమైన సంగీతం, కిరణ్ అబ్బవరం ఎనర్జీతో 'కె ర్యాంప్' థియేటర్లలో మంచి హిట్టుగా నిలిచింది.

# అలాంటి పెళ్లి కావాలి నాకు 'ప్రేమంటే' టీజర్ ఫన్‌ఫుల్



**హైదరాబాద్ :**ప్రియదర్శి, ఆనంది కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ప్రేమంటే'. 'థ్రిల్ యూ ప్రాప్తిరస్తు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రాన్ని నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. పాపులర్ యాంకర్ సుమ కీలక పాత్రలో కనిపించనుండటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.టీజర్‌లో ప్రియదర్శి, ఆనంది మధ్య చక్కని కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచింది. "మీకేం అంచనాలు లేవు.. మ్యారేజ్ లైఫ్ ఎక్స్‌పెక్టేషన్స్?" అని ఆనందిని అడిగిన ప్రియదర్శి, "ఉదాహరణకు నేను పెళ్లి చేసుకునే అమ్మాయికి నా వల్ల ఎలాంటి సమస్యలు రాకూడదని నేనుకుంటా" అంటాడు. దానికి ఆనంది స్పందిస్తూ౦ "పెళ్లి తర్వాత లైఫ్ థ్రిల్లింగ్‌గా ఉండాలి.. రోజంతా కోట్లాడుకున్నా, ఎంత కోపమొచ్చినా, చివరికి చాయ్ తాగుతూ మాట్లాడుకొని ప్రేమతోనే పడుకోవాలి.. అట్లాంటి పెళ్లి కావాలి నాకు" అంటుంది.ఇక ప్రియదర్శి సరదాగా "రమ్య సెకండ్ సెటప్‌లాంటిదేమీ లేదు ప్లీజ్!" అని చెప్పే సీన్ నవ్వులు పంచుతోంది. మొత్తానికి పెళ్లి ముందు భిన్న అభిప్రాయాలు కలిగిన ఇద్దరు వ్యక్తులు పెళ్లి తర్వాత ఎలా మారతారన్న నేపథ్యంలో ఫన్, భావోద్వేగాలతో కూడిన పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమా రానుందనే సంకేతాలు టీజర్‌లో కనిపిస్తున్నాయి.ప్రియదర్శి పాత్ర కొత్తగా, వినోదాత్మకంగా ఉండబోతుందని టీజర్ స్పష్టంగా చూపిస్తోంది. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తుండగా, రచన దర్శకత్వం నవనీత్ శ్రీరామ్‌దే. శ్రీవెంకటేశ్వర సినిమాస్ పతాకంపై జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# రష్మికకు డబుల్ రెమ్యునరేషన్...



**–'ది గర్ల్‌ఫ్రెండ్' బృందం హాట్ టాక్....**

**హైదరాబాద్ :**నేషనల్ క్రష్ రష్మిక మందన్నా టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నాడు. ఈ చిత్రం నవంబర్ 7న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం సినిమా ప్రమోషన్లతో రష్మిక అండ్ టీం బిజీగా ఉంది.వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని ఈ సందర్భంగా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ "'ది గర్ల్‌ఫ్రెండ్' ఒక కాలేజ్‌లో జరిగే ప్రేమకథ. ప్రేక్షకుల మనసులను తాకేలా సినిమా సాగుతుంది. కథ విన్న వెంటనే రష్మిక ఎలాంటి రెమ్యునరేషన్ తీసుకోకుండా ఒకే చెప్పింది. ఆమె డెడికేషన్ చూస్తే మేమంతా ఆశ్చర్యపోయాం. సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం. రిలీజ్ తర్వాత రష్మికకు మేము రెట్టింపు రెమ్యునరేషన్ ఇవ్వబోతున్నాం," అని చెప్పారు.ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారాయి. రష్మిక అభిమానులు ఈ కామెంట్స్‌పై హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై విద్య కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ మలయాళ సంగీత దర్శకుడు హేశమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వస్తుండటంతో సినిమా మీద అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి.

# నాగ చైతన్య 'NC24'లో మీనాక్షి చౌదరి పాత్ర ఏమిటి..?




**హైదరాబాద్ :**టాలీవుడ్ హీరో అక్కినేని నాగ చైతన్య నటిస్తున్న తాజా సినిమా 'NC24'. ఈ చిత్రాన్ని 'విరూపాక్ష' ఖ్యాతి గల దర్శకుడు కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది. మైథలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.తాజాగా మూవీ మేకర్స్ ఒక ఆసక్తికర పోస్టర్‌ను షేర్ చేశారు. "ప్రతీ యాత్ర ఒక రహస్యంతో ప్రారంభమవుతుంది" అంటూ క్యాప్షన్ ఇచ్చి, డార్క్ షేడ్స్‌లో మీనాక్షి చౌదరి బ్యాక్ లుక్‌ను విడుదల చేశారు. రేపు ఉదయం 10:08 గంటలకు ఆమె పాత్ర వివరాలను వెల్లడించనున్నట్లు ప్రకటించారు. ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మీనాక్షి ఏ పాత్రలో కనిపించబోతోందన్న ఆసక్తి ఫ్యాన్స్‌లో పెరుగుతోంది.ఇక మరోవైపు, 'లాపతా లేడీస్' ఫేమ్ నటుడు స్పర్శ్ శ్రీవాత్సవ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. లాపతా లేడీస్ చిత్రంలో దీపక్ కుమార్‌గా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ రాజస్థానీ యాక్టర్, ఇప్పుడు టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నాడు.ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎస్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సంగీతం కాంతార ఫేమ్ అజనీశ్ లోక్‌నాథ్ అందిస్తున్నారు.ఈ ప్రాజెక్ట్‌పై చైతన్య అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మైథలాజికల్ థ్రిల్లర్‌తో అక్కినేని హీరో మరోసారి సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు.

# సుందర్ దంచేశాడు సిరీస్ సమం...



**ముంబై, నవంబర్ 2 :**పొట్టి సిరీస్‌లో భారత జట్టు బోణీ కొట్టింది. గెలవక తప్పని మ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో ఆస్ట్రేలియాకు చెక్ పెట్టింది. కంగారూలు నిర్దేశించిన 187 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో టీమిండియా అద్భుతంగా రాణించింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(24), తిలక్ వర్మ(29)లు దూకుడుగా ఆడి పునాది వేశారు. చివర్లో వాషింగ్టన్ సుందర్(49 నాటౌట్), జితేశ్ శర్మ(22 నాటౌట్) ధనాధన్ ఆడి భారత్‌కు ఘన విజయాన్ని అందించారు.ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మొదటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. రెండో మ్యాచ్ గెలిచిన ఆస్ట్రేలియాకు సమాధానంగా భారత్ మూడో టీ20లో విజయం సాధించింది. ఇరుజట్లు చెరో విజయంతో 1-1తో సమంగా ఉన్నాయి. ఆసియా కప్ ఛాంపియన్‌గా తొలి టీ20 సిరీస్ ఆడుతున్న టీమిండియా, వ్యూహాత్మకంగా ఆడి సిరీస్‌లో నిలిచింది.ఎల్లిస్ దెబ్బతీసినా.. సుందర్ దంచేశాడు మూడో టీ20లో భారత ఇన్నింగ్స్‌ను ఓపెనర్ అభిషేక్ శర్మ(25) సిక్సర్లతో దుమ్మురేపాడు. నాథన్ ఎల్లిస్(3/36) మూడు కీలక వికెట్లు తీయడంతో కంగారూలకు కొంత ఊరట లభించినా, సుందర్ చెలరేగడంతో వారి ఆశలు భగ్నమయ్యాయి. అబాట్ వేసిన 14వ ఓవర్లో వరుసగా 4, 6, 6 బాదిన వాషీ ఇన్నింగ్స్ పటిష్టం చేశాడు.సూర్యకుమార్, తిలక్ ఔటైన తర్వాత అక్షర్ పటేల్(17) సహకరించాడు. చివర్లో సుందర్ జితేశ్ జోడీ మరో వికెట్ ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. 19వ ఓవర్లో జితేశ్ బౌండరీతో భారత్ విజయకేతనం ఎగురవేసింది.డేవిడ్, స్టోయినిస్ చెలరేగగా టాస్ ఓడి బౌలింగ్ ఎంచుకున్న భారత్ ఆరంభంలోనే ఆస్ట్రేలియాను ఒత్తిడిలోకి నెట్టింది. అర్ష్‌దీప్ సింగ్(3/35) అద్భుతంగా బౌలింగ్ చేస్తూ టాప్ ఆర్డర్‌ను కూలదోశాడు. అయితే టిమ్ డేవిడ్(74), మార్కస్ స్టోయినిస్(64) అర్ధశతకాలతో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. పెద్ద షాట్లతో విరుచుకపడి జట్టును 186 పరుగుల వరకు తీసుకెళ్లారు.డేవిడ్ ఔటైన తర్వాత స్టోయినిస్ గేర్ మార్చి దూకుడు చూపాడు. మాథ్యూ షార్ట్(26 నాటౌట్)తో కలిసి కంగారూలకు పటిష్ట స్కోర్ అందించాడు. అయినా.. భారత బౌలర్లు ఆ టార్గెట్‌ను చిన్నదిగా మార్చారు.భారత్, ఆస్ట్రేలియా మధ్య నాలుగో టీ20 నవంబర్ 6న జరగనుంది.

## సెంచరీ మిస్ చేసిన పంత్ భారత్ ‘ఏ’ ఘన విజయం



**ముంబై :**తొలి అనధికారిక టెస్టులో భారత ‘ఏ’ జట్టు జయభేరి మోగించింది. పునరాగమనం మ్యాచ్‌లో చెలరేగిన రిషభ్ పంత్ (90) దక్షిణాఫ్రికా ‘ఏ’ బౌలర్లను ఊపిరి తిప్పుకోనివ్వలేదు. సెంచరీను చేజార్చుకున్నా జట్టు విజయానికి పునాది వేశాడు. పంత్ వెనుదిరిగాక మానవ్ సుతార్(20 నాటౌట్), అన్షుల్ కంభోజ్(37 నాటౌట్)లు పట్టుదలగా ఆడి భారత్‌కు 3 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించారు. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.బెంగళూరులోని సీఈవో మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన కెప్టెన్ రిషభ్ పంత్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు హాఫ్ సెంచరీతో చెలరేగాడు. దక్షిణాఫ్రికా బౌలర్లను చిత్తు చేసిన పంత్ 90 పరుగులు చేసి సెంచరీకి చేరువయ్యాడు. చివరి రోజు 156 పరుగులు అవసరమైన వేళ పంత్ ఔటైన తర్వాత సుతార్, కంభోజ్ జోడీ మరో వికెట్ ఇవ్వకుండా విజయం సాధించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు తీసిన తనుష్ కొతియాన్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా ఎంపికయ్యాడు. రెండో అనధికారిక టెస్టు నవంబర్ 6న ప్రారంభం కానుంది. 32కే మూడు వికెట్లు.. సఫారీలు కూలి పోయారు తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగుల ఆధిక్యంతో మూడో రోజు భారత బౌలర్లు దక్షిణాఫ్రికా ‘ఏ’ బ్యాటర్లను చిత్తుచేశారు. ఓవర్‌నైట్ స్కోర్ 30/0తో ఆరంభించిన సఫారీ జట్టును తనుష్ కొతియాన్(4/26), అన్షుల్ కంభోజ్(3/39)లు బెంబేలెత్తించారు. వీరిద్దరి విజృంభణతో ఆ జట్టు 199 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ లెసెగో సెనొక్వెనె(37), జుబయిర్ హంజా(37)లు మాత్రమే కొంత ప్రతిఘటించారు.అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 32 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్(90) తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించాడు. ఆయుష్ బదోని(34)తో కలిసి జట్టును గెలుపు దిశగా నడిపించాడు. చివర్లో సుతార్, కంభోజ్ జోడీ గెలుపు కట్టబెట్టింది.తొలి ఇన్నింగ్స్‌లో కొతియాన్ మెరుపు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో తనుష్ కొతియాన్(4/83), గుర్నూర్ బ్రార్(2/45) బౌలింగ్ దెబ్బకు 309 పరుగులకే ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌లో సాయి సుదర్శన్(32), ఆయుష్ మాత్రే(65)లు తొలి వికెట్‌కు 91 రన్స్ జోడించి శుభారంభం ఇచ్చారు. కానీ స్పిన్నర్ సుబ్రయేన్(5/61) కీలక వికెట్లు తీసి భారత్‌ను కుదిపాడు. గాయం తర్వాత కెప్టెన్‌గా పంత్(17) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా, రెండో ఇన్నింగ్స్‌లో తన సత్తా చాటాడు. చివరికి సమిష్టి ప్రదర్శనతో భారత ‘ఏ’ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది.

# ప్రపంచకప్ విజేతగా టీమిండియా... దశాబ్దాల కల సహకారం...




నిరీక్షణకు తెరపడింది. దశాబ్దాలుగా గుండెలను పిండేస్తున్న ఆ వేదనకు విముక్తి లభించింది. గతంలో తుది మెట్టుపై చిందిన కన్నీటి చుక్కలన్నీ నేడు ఆనందభాష్పాలుగా మారాయి. ఎన్నో ఏండ్ల కలను సాకారం చేసుకున్న ఇండియా అమ్మాయిల జట్టు ఎట్టకేలకు జగజ్జేతగా అవతరించింది. ఓపెనర్ షెఫాలీ వర్మ (78 బాల్స్‌లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87బీ 2/36), దీప్తి శర్మ (58 బాల్స్‌లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 58బీ 5/39) ఆల్‌రౌండ్ మెరుపులతో ఆదివారం జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని టీమిండియా 52 రన్స్ తేడాతో ఘన విజయం సాధించింది.టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 298/7 స్కోరు చేసింది. షెఫాలీ, దీప్తికి తోడు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (58 బాల్స్‌లో 8 ఫోర్లతో 45), రిచా ఘోష్ (24 బాల్స్‌లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 34) విలువైన రన్స్ అందించారు. సౌతాఫ్రికా బౌలర్లలో అయబోం ఖాకా 3/58) మూడు వికెట్లు పడగొట్టింది. అనంతరం ఛేజింగ్‌లో సఫారీ టీమ్ 45.3 ఓవర్లలో 246 రన్స్‌కే ఆలౌటై ఓడింది. కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (98 బాల్స్‌లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 101) సెంచరీతో పోరాడినా ఫలితం లేకపోయింది. షెఫాలీకి ప్లేయర్ ఆఫ్ మ్యాచ్, దీప్తికి ప్లేయర్ అఫ్ ద సిరీస్? అవార్డులు లభించాయి.ఓపెనింగ్ అదుర్స్...వాన కారణంగా రెండు గంటల ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌లో ఓపెనర్లు షెఫాలీ, మంధాన తొలి వికెట్‌కు 104 రన్స్ జోడించి అద్భుతమైన పునాది వేశారు. సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన తన ట్రేడ్‌మార్క్ కట్, స్వీప్ షాట్లు, డ్రైవ్స్‌తో అలరించింది. గేమ్ ఛేంజర్స్ వర్మ–శర్మ...ఇండియా విమెన్స్ క్రికెట్ చరిత్రలో నిలిచిపోయే ఉద్వేగభరిత ఫైనల్లో షెఫాలీ వర్మ–దీప్తి శర్మ జట్టుకు జయ ద్వయంగా నిలిచారు. ఇద్దరూ ఆల్‌రౌండ్ పెర్ఫామెన్స్‌తో ఆతిథ్య జట్టుకు చిరస్మరణీయ విజయం అందించారు. చాన్నాళ్లుగా నేషనల్ జట్టుకు దూరమైన షెఫాలీ వర్మ ఫైనల్ మ్యాచ్‌ను శాసించడం చూస్తుంటే కప్పును గెలిపించడానికి దేవుడు రాసిన స్క్రిప్ట్‌లా ఉంది.సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ప్రతీక రావల్‌కు గాయం కావడంతో అనూహ్యంగా జట్టులోకి వచ్చిన షెఫాలీ, అదృష్టం కంటే పట్టుదలే ఎక్కువ అని నిరూపించింది. బ్యాటింగ్‌లో మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగిన ఆమె, ఛేజింగ్ కీలక దశలో బౌలింగ్‌కు వచ్చి వెంటవెంటనే రెండు కీలక వికెట్లు పడగొట్టి.. అసలైన ‘గేమ్ ఛేంజర్’ అని నిరూపించుకుంది. ఇక, దీప్తి శర్మ ఆల్‌రౌండర్‌కు అసలు నిర్వచనం చెప్పింది.మిడిలార్డర్ బ్యాటింగ్ బాధ్యతను భుజాలపై వేసుకున్న ఆమె షెఫాలీ వర్మ ఇచ్చిన మంచి పునాదిపై జట్టు భారీ స్కోరు చేసేందుకు బాటలు వేసింది. ఆపై బాల్‌తోనూ మెప్పించి సఫారీలను రెండు సందర్భాల్లో ఘోర దెబ్బకొట్టింది. మధ్యలో ఆరు బాల్స్ తేడాలో రెండు వికెట్లు తీసి ప్రత్యర్థికి బ్రేకులు వేసిన ఆమె.. చివర్లో నాలుగు బాల్స్ తేడాలో వోల్‌వార్ట్, ట్రయాన్‌ను వెనక్కుపంపి విజయం ఖాయం చేసింది.

# టీమిండియాకు ఫైనల్ చేర్చిన రియల్ లైఫ్ కబీర్ ఖాన్!

**హైదరాబాద్ :**ఇది ఎవరూ రాయకపోయిన కథ. ఎవరికీ తెలియని గాథ. భారత జట్టు జెర్సీని ఎప్పుడూ ధరించని ఓ ఆటగాడు.. దేశం తరఫున ఆడిన వారు సైతం సాధించలేని ఘనత సాధించాడు. జట్టును ప్రపంచకప్ ఫైనల్ వరకు చేర్చాడు. హ్యాట్రిక్ పరాజయాల అనంతరం కూడా ‘మీరు విజేతలే’ అంటూ జట్టును ముందుండి నడిపించాడు. అతడేం భారత మహిళల జట్టు కోచ్ అమోల్ మజుందార్.నిరీక్షణతో ప్రారంభమైన అమోల్ ప్రయాణం 1988లో 13 ఏళ్ల వయసులో హారిస్ షీల్డ్ టోర్నమెంట్‌లో నెట్స్‌లో



బ్యాటింగ్ చేసే అవకాశం కోసం వేచి ఉన్నాడు. ఆ రోజు సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీ 664 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడంతో అమోల్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. అదే అతని జీవితానికి ప్రతీకగా మారింది ః ‘ఎప్పుడూ అవకాశానికి ఎదురుచూసే ఆటగాడు’. 1993లో బాంబే (ప్రస్తుత ముంబయి) తరఫున తొలి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లోనే 260 పరుగులు చేసి రికార్డు సృష్టించాడు. అది ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక తొలి ఇన్నింగ్స్ స్కోరు. అంతా ఆయనను భారత క్రికెట్ భవిష్యత్తు అని ప్రశంసించారు. కానీ, విధి వేరేగా సాగింది.20 ఏళ్ల కెరీర్‌లో 11,167 పరుగులు, 30 సెంచరీలు చేసినా.. భారత జట్టులో ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం దక్కలేదు. టెండూల్కర్, ద్రవిడ్, గంగూలీ, లక్ష్మణ్‌ల నీడలో ఆయన కెరీర్ నిశ్శబ్దమైంది.తండ్రి మాటే జీవితం మార్చింది 2002లో సెలెక్టర్ల నిర్లక్ష్యంతో విసిగి ఆటను వదిలేయాలనుకున్న అమోల్‌కు ఆయన తండ్రి అనిల్ మజుందార్ ఒక్క మాట చెప్పాడుః “ఆటను ఆపేయొద్దు, నీలో ఇంకా క్రికెట్ ఉంది.” ఆ ఒక్క మాట ఆయన జీవితాన్ని మారేసింది. తిరిగి మైదానంలోకి వచ్చి 2006లో ముంబయికి రంజీ ట్రోఫీని అందించాడు. రోహిత్ శర్మకు తొలి అవకాశం ఇచ్చినవాడు కూడా ఆయనే.2014లో రిటైర్ అయిన తర్వాత సచిన్ టెండూల్కర్ ఆయనను “క్రికెట్ సేవకుడు”గా పేర్కొన్నాడు. కానీ, అమోల్ మనసులో మాత్రం ఒక శూన్యంః “భారత జట్టుకు ఎప్పుడూ ఆడలేదు” అన్న బాధ.ప్లేయర్ నుంచి కోచ్ వరకూ ప్రయాణం రిటైర్మెంట్ అనంతరం కోచింగ్ రంగంలో అడుగుపెట్టాడు. నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, రాజస్థాన్ రాయల్స్‌తో పనిచేశాడు. తక్కువ మాట్లాడే కానీ లోతుగా ఆలోచించే కోచ్‌గా గుర్తింపు పొందాడు.2023 అక్టోబర్‌లో భారత మహిళల జట్టుకు హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. “భారత జట్టుకు ఎప్పుడూ ఆడని వ్యక్తి కోచ్‌గా ఎలా ఉంటాడు?” అన్న విమర్శల మధ్య ఆయన అద్భుత ఫలితాలు చూపించాడు.విమర్శల నుంచి విజయం వరకు 2025 ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్ వరుస ఓటములు ఎదుర్కొంది. సోషల్ మీడియాలో మీమ్స్, విమర్శలు వెల్లువెత్తాయి. అప్పుడు మజుందార్ జట్టుకు ధైర్యం నింపాడు.హర్మన్‌ప్రీత్ కౌర్ చెప్పినట్లుగా ః “ఇంగ్లండ్ మ్యాచ్ తర్వాత ఆయన ఒక్క మాటే చెప్పారు: మీరు ఈ మ్యాచ్‌ను సులభంగా ముగించాలి. ఆ మాట మాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.”జట్టులో మళ్లీ చక్‌దే ఇండియా మూవీ కబీర్ ఖాన్‌లా స్ఫూర్తి నింపాడు.ఫైనల్ దిశగా తీసుకెళ్లిన ఒక లైన్ ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ ముందు ఆయన వైట్‌బోర్డ్‌పై రాసిన మాట ః‘ఫైనల్‌కు చేరుకోవడానికి మాకు వారి కంటే ఒక పరుగు మాత్రమే అవసరం.”ఆ మాట జట్టును ఆత్మవిశ్వాసంతో నింపింది. జెమిమా రోడ్రిగ్స్ (127 నాటౌట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (89) అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ 339 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేసి ఫైనల్‌కు చేరింది.మైదానంలో సంబరాలు జరగగా, సైలెంట్‌గా నిలిచిన కోచ్ కళ్లలో ఆనందభాష్పాలు మెరిశాయి.జెర్సీ లేకున్నా చరిత్ర సృష్టించిన వ్యక్తిభారత జట్టు జెర్సీని ఎప్పుడూ ధరించని అమోల్ మజుందార్ః ఇప్పుడు భారత జట్టును ఫైనల్‌కు తీసుకువెళ్లాడు.చక్‌దే ఇండియాలో కబీర్ ఖాన్ లాగే, ఆటగాళ్లలో నిబ్బరాన్ని, నమ్మకాన్ని నింపాడు.ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా మాటల్లో ః“ఆయన మాకు స్నేహపూర్వక కోచ్. ఎప్పుడూ అరవరు. మాట్లాడినప్పుడు మేము బాగా చేయాలనిపిస్తుంది.”అమోల్ మజుందార్ ఒక ఐకాన్13 ఏళ్ల వయసులో బ్యాటింగ్ చేసే అవకాశం దక్కని బాలుడు.. ఇప్పుడు భారత మహిళల జట్టును ప్రపంచకప్ ఫైనల్ దిశగా నడిపించాడు.క్రికెట్ కేవలం ఆడే ఆటగాళ్లకే కాదు, హృదయపూర్వకంగా ఆడించే వారికి కూడా చెందుతుందని నిరూపించాడు.కొన్నిసార్లు ఆటగాళ్లను కాదు, ఆటను మార్చిన వారినే చరిత్ర గుర్తుంచుకుంటుంది.అమోల్ మజుందార్ అదే నిజంచేశాడు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com